

డా. సి. ఆనందారామం

"పాత విలువలు నశించి పోయాయి. కొత్తవి ఏర్పడలేదు."

ఏనాడో చలంఅన్న ఈ మాటలు ఈ నాటికీ వర్తిస్తాయి. థియరిటికల్‌లో ఈ నాటికీ మనం ప్రాచీన సంప్రదాయాలనూ, అలవాట్లనూ పట్టుకుని వేలాడుతున్నాం! కానీ ఆచరణలో చాపకింద నీరులా, చల్లగా పాశ్చాత్య సంస్కృతి, భావాలు, ఆలోచనలు, సమాజంలో ప్రవేశించాయి. వ్యాపిస్తున్నాయి. ఈ కారణాన థియరీకీ, ప్రాక్టీస్‌కీ మధ్య విపరీతమైన అఘాతం కనిపిస్తోంది.

నమ్ముతున్న విశ్వాసాలకూ, నడుస్తోన్న జీవితానికీ మధ్య రోజు రోజుకీ పెద్దదవుతోన్న వ్యత్యాసాన్ని చూపించేవి, 'వాస్తవిక ప్రణయగాథలు!' 'నిజంగా జరిగినవి' అనే అర్థంలోకాదు. కథల్లో, నవలల్లో కనిపించే "ఆదర్శ ప్రేమ"తో ఏ పోలికాలేని ప్రాక్టికల్ భావ సంచలనాలను ప్రతిబింబించే కథలు.

## వాస్తవిక ప్రణయగాథలు

# ఏడేడు జన్మల బంధం

డా॥ సి. ఆనందారామం

క్రింది భాగంలో కుడివైపు మొదటి గది నూతనది!

ఎడమవైపు వాటాలో ఎవరున్నారో గాని, ఒక పిన్నిగారు మాత్రం ఎప్పుడూ కిటికీలోంచి, కుడివైపు గదిని చూస్తూ ఉంటుంది.

ఎదురింట్లో కళ్ళద్దాలాయన కూడా అవకాశమున్నప్పుడల్లా ఆ గదినే చూస్తూ వుంటాడు.

పైభాగంలో అద్దెకున్న ఆంగ్లో ఇండియన్ టైపిస్ట్ హెలీనా దృష్టి సహితం కింది గదిమీదే!

ఇంతమందిని ఆ గది ఆకర్షించటానికి కారణం గది అందంకాదు. గదికున్న ప్రత్యేకత అసలు కాదు. ఆ గదిలో అద్దెకున్న నూతన్ ఆకర్షణ కానేకాదు.

అందరినీ ఆకర్షిస్తున్నది, అటూ ఇటూ ఎటూ చూడకుండా ఆ గదిలోకి స్వతంత్రంగా వచ్చేసే సమీర.

సమీరమీద ఇంతమంది దృష్టి పడటానికి కారణం ఆ అమ్మాయిలో ఆకర్షణకాదు. రహస్య ప్రణయంలో ఉన్న ఆకర్షణ.

నూతన్‌కి పెళ్ళి కాలేదు.

అతడు గదిలో ఒంటరిగా వుంటున్నాడు.

ఆ అమ్మాయికీ పెళ్ళికాలేదు. మెడ బోసిగా వుంది.


ఒంటరిగా గదికొచ్చేస్తోంది.

ఏం జరుగుతోందో, లోపల?

పక్కింటి వాటాలో పిన్నిగారికీ, ఎదురింటి కళ్ళద్దాల ఆఫీసర్‌కీ, పైనున్న టైపిస్ట్ హెలీనాకీ, అది తెలుసుకోవాలనే కుతూహలం!

అందరి కుతూహలానికీ సమాధానమా అన్నట్లు- "భౌ!భౌ!"మని అరుస్తోంది నూతన్ పెంచుతోన్న ఫ్యూరీ, అల్సేషియన్ డాగ్.

సమీర తనగదిలో అడుగు పెట్టగానే ఫ్యూరీ బెల్టు విప్పేసి గుమ్మందగ్గిర వదిలేస్తాడు నూతన్. అది "భౌభౌ" మని అరుస్తూ గదిముందు అటూ ఇటూ తిరుగుతోంటే, పిన్నిగారూ,


కథా నిలయం
శ్రీకాకుళం



టైపిస్టూ, ఆఫీసరూ, ఎంత కుతూహలంగా ఉన్నా, గదిదరిదాపులకి రాలేరు.

ఆ "భౌ-భౌ"ల నేపథ్యంలోనే మాట్లాడుతారు సమీ, నూతన్. వాళ్ళిద్దరికీ ఆ భౌభౌలు ఎంతగా అలవాటయ్యాయంటే, ఒకరోజు ఫ్యూరీకి వంట్లో బాగుండక మగతగా నిద్రపోతోంటే, ఇద్దరిలో ఏ ఒక్కరికీ మూడ్ రాక, అప్పటికప్పుడు దాన్ని ఆటోలో వెటర్నిటీ డాక్టర్ వగ్గరికి తీసికెళ్ళారు.

ఎప్పటిలా పిన్నిగారూ, టైపిస్టూ, కళ్ళజోడు ఆఫీసరూ సాక్షులుగా, నూతన్ గదిలోకి వచ్చింది సమీర. ఫ్యూరీ తన సంగీతం ప్రారంభించింది.

తను చెప్పాలనుకున్నది ఎలా చెప్పాలా- అని మథన పడుతోంది సమీర.

తను చెప్పబోయేది వింటే, సమీర రియాక్షన్ ఎలా వుంటుందా- అని భయపడుతున్నాడు నూతన్.

"డార్లింగ్! అయ్ లవ్ యూ!"




"హనీ! అయ్‌కాంట్ లివ్ విత్ అవుట్ యూ!"

"ఈ క్షణం ఇలా శాశ్వతంగా ఉండి పోతే బాగుండునని వుంది."

"ఇది కలే అయితే, ఈ కలలోంచి నాకు మెలకువ రాకూడదు!"

"ఈఅనుబంధం ఈనాటిదికాదు."

"ఏడేడు జన్మల బంధం!"

ఇబ్బందిగా కదిలాడు నూతన్. ఇప్పుడు చెప్పాలి! ఇంకా ఆలస్యం చెయ్యకూడదు.

"ఇది ఏడడుగుల బంధంగా మారితే...."

అదిరిపడింది సమీర. అతి త్వరగా తన తొట్రుపాటు అణచుకుంది.

"అయామ్‌సారీ నూతన్! నేనూ.. నాకూ...."

నూతన్‌కూడా మామూలుగా ఉండటానికి అవస్థ పడుతున్నాడు.

"మా వాళ్ళు-నాకూ...."

అతడి మాటలు సరిగ్గా వినపడటం లేదు సమీరకి. ఏదో ఒక రకంగా ఈ అవస్థలోంచి బయట పడాలి.


"నూతన్, డార్లింగ్! నువ్వు లేకుండా ఎలా బతకను నేను?"

అతడిని గట్టిగా కౌగిలించుకొంది. అంత గాఢంగానూ ఆమెని దగ్గిరకి తీసుకున్నాడు.

"తప్పదు. ప్రేమ త్యాగాన్ని కోరుతుంది. ప్రేమించుకున్న వాళ్ళు త్యాగం చెయ్యవలసిందే!"

"మన ఏడేడుజన్మల బంధం, ఈ జన్మలో మిస్ అవుతుందేమో?"

"ఒక్క జన్మలో మిస్ అయినంత మాత్రాన మన పవిత్ర ప్రేమకి కళంకంరాదు. పక్కింటిపిన్నిగారూ, కళ్ళజోడు ఆఫీసరూ, టైపిస్టు అమ్మాయీ సాక్షులుగా వచ్చేజన్మలో




తప్పకుండా ఏకమవుతాం!"

"ఆ తర్వాత ఆరు జన్మలూ, ఆరు నూరయినా, నూరు ఆరయినా, ఒక్కటిగానే వుందాం!"

"మా అమ్మా నాన్నా నాకు ఏదో సంబంధం చూసారు."

"మా అమ్మా నాన్నా కూడా...."

"పెద్దవాళ్ళని ఎదిరించకూడదు. తల్లి దండ్రుల మాట కాదనటం మహా పాపం!"

"అవును. మా అమ్మ ఏడిస్తే నేను చూడలేను. నాకూ ఏడుపొస్తుంది."

"అంచేత...."

"ఈ జన్మకి మనం ఇలా...."

"విడిపోవలసిందే!"

"పెద్ద వాళ్ళకోసం- మనల్ని కని పెంచిన వాళ్ళకోసం...."

"ఈ త్యాగం చెయ్యవలసిందే!"

"ఈ జన్మలో కాకపోయినా పై జన్మలో కలుసుకుందాం!"

"ఆ తర్వాతి ఆరు జన్మలవరకూ ఏ ప్రళయం వచ్చినా విడిపోవద్దు!"

"గుడ్ బై!"

"గుడ్ బై!"

ఇద్దరూ గాఢంగా కౌగిలించుకున్నారు. ఎప్పటికీ ఒకరునొకరు వదలలేనట్లు ముద్దు పెట్టుకుంటూ ఉండిపోయారు చాలా సేపు. కన్నీళ్ళతో విడిపోయారు. ఫ్యూరీ "భాభా"లతో వీడ్కోలు చెప్పింది.

* * *

"బాబూ! శంకర్రావుగారి అమ్మాయిని నీకిస్తామంటూ వచ్చారు. బి.ఏ.పాస యిందిట! వున్నవాళ్ళే! అమ్మాయి కూడా బాగుంటుందిట!"

నూతన్ తల్లి పెళ్ళి సంబంధం వివరాలు చెప్పి, "ఏమంటావూ?" అని అడిగింది.

నూతన్ సిగ్గుపడుతూ నవ్వి. "నాకేం తెలుసమ్మా! పెద్దవాళ్ళు మీరు మంచీచెడ్డా ఆలోచించి ఏ సంబంధం నిర్ణయిస్తే అది చేసుకుంటాను" అన్నాడు.

ఆ తల్లి పొంగిపోయింది.

"మాబాబు చదువుకున్నా, ఉద్యోగం చేస్తున్నా, ఈ కాలం పోకిళ్ళులేవు. నేనెంతచెప్తే అంత!" పదిమందికీ చెప్పుకుని మురిసిపోయింది.

*                *

"నువ్వెవరినయినా ప్రేమిస్తే చెప్పు! వాళ్ళకే ఇచ్చి పెళ్ళి చేస్తాను." అంది సమీర తల్లి. ఇంతచదులు చెప్పించినందుకు, ఈ ఆడపిల్లలు ప్రేమ పెళ్ళిళ్ళయినా చేసుకుంటే, కట్నాలూ, కానుకలూ, పెళ్ళి ఖర్చులూ- ఈ గొడవలయినా తప్పు తాయని ఆ తల్లి ఆశ! సమీర బుంగమూతి పెట్టి, "భలేదానివమ్మా! నేనెప్పుడయినా అసలుమొగవాళ్ళతో మాట్లాడానా? ఈ ప్రేమలూ గీమలూ నాకేం తెలీవు. నువ్వు ఎవరిని చేసుకోమంటే, వాళ్ళని చేసుకుం టాను" అంది.

ఆ తల్లి తనను గర్వంతో పొంగి పోయింది. చిన్నప్పటి నుంచీ, అరి టాకూ- ముల్లూ పోలికతెచ్చి తను చేసిన బోధలు ఊరికే పోలేదు.

"అయితే ప్రసాదరావుగారి అబ్బాయి సంబంధం నీకిష్టమేనా?"

"ఆ అబ్బాయిని చూసి.... అన్నట్లు అతడి ఉద్యోగం మంచిదేనా?" నిస్సంకోచంగా అడిగేసింది.

"హమ్మ. గడుగ్గాయీ!" అనుకుంది తల్లి ముద్దుగా.

లక్షణంగా శాస్త్రోక్తంగా పెళ్ళి చూపులు ఏర్పాటయ్యాయి. సమీర తల్లి ఫలహారాలూ వగైరా సిద్ధం చేసింది. సమీర అతినాజుగ్గా ఆధుని కంగా అలంకరించుకుంది.

టాక్సీలో వచ్చారు మొగపెళ్ళివారు. మర్యాదలు జరిపారు ఆడ పెళ్ళి వారు. మొగాళ్ళు అయిదు నిమిషాలు లోకాభిరామాయణం మాట్లాడుకు న్నారు. ఆడవాళ్ళు నగలూ, చీరలూ పరస్పరం పరీక్షగా అంచనాలువేసు కున్నారు.

పురోహితుడు చెప్పిన శుభ ఘడి యల్లో సమీరని వెంట తీసుకొచ్చి కుర్చీలో కూచోబెట్టింది తల్లి. సూటిగా తలఎత్తి చూస్తే బాగోదని వాలుగా పెళ్ళి కొడుకుని చూసింది సమీర.

దిగ్గున లేచి నిలబడింది.

పెళ్ళికొడుకూ అలాగే నిలబడ్డాడు.

లోపలికి వచ్చేసింది.

అతడు బయటికి వెళ్ళిపోయాడు.

కంగారు పడుతూ, "ఏమిటేమిటి?"

అంటూ అటువాళ్ళు అటూ, ఇటు వాళ్ళు ఇటూ చేరుకున్నారు.

"అమ్మా! నీకెక్కడ దొరికింది ఈ సంబంధం? ఇలాంటి తిరుగుబోతు పిల్లనా, నాకు పెళ్ళిచేస్తావు?" తల్లి మీద విరుచుకు పడ్డాడు నూతన్. బిత్తరపోయింది తల్లి.

"ఏమోరా! అన్ని విధాల బాగుంటే ముచ్చటపడ్డాను. అవునుకానీ, ఆ అమ్మాయి మంచిది కాదని నీకెవరు చెప్పారు?"

"నా ఫ్రెండ్ చెప్పాడు."

"చెప్పుడు మాటలు వినకూడదురా! గిట్టనివాళ్ళు లక్ష రకాలుగా అంటుంటారు."

"నీకు తెలీదమ్మా! నా కళ్ళతో నేను స్వయంగా చూశాను. ఈ అమ్మాయిని నేను చచ్చినా చేసుకోను. ఇంకో మంచి అమ్మాయిని చూడు!" కొడుకు మాటల్లో తీవ్రతకి బిత్తరపోయి అయోమయంగా చూసింది తల్లి.

అక్కడ సమీర మంచంమీద వాలి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"అన్ని విధాలా అనుకూలమైన సంబంధం- ఏవరో ఏదో అన్నారని వద్దంటావేవిటే?" విసుక్కుంది తల్లి.

విసురుగా లేచింది సమీర.

"నాకీ సంబంధం చేసావంటే ఇంత విషంమింగి చస్తాను. అతడికి ఆడ పిల్లలతో స్నేహాలు చేయటం ఒక ఆట! అలాంటి వాడినా, నన్ను చేసుకోమంటావు? జీవితాంతం బ్రహ్మచారిణిగానైనా వుంటాను కాని...."

నోట మాటరాలేదు తల్లికి! ఆవిడకి ఎంత తల పగల గొట్టుకున్నా అర్థం కాని విషయం ఒక్కటే- మొగవాళ్ళతో అసలు మాట్లాడని తన కూతురికి, పెళ్ళికొడుకు ఆడ స్నేహితుల సంగతి ఎలా తెలిసిందా అని!!

